అతివలను ఆకట్టుకునేలా చీరలు!

- విభిన్న డిజైన్లతో రూపకల్పన
- పరిశీలనకు టెస్కో అధికారులకు అందజేత

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల

అతివల మదిని దోచే వర్ణరంజితమైన చీరల్లో ఎన్నో వైవిధ్యాలుంటాయి. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చే చీరలతో వారిని ఆకట్టుకునే నూలు వినియోగం మొదలు రకరకాల డిజైన్లతో నమూనాలను జిల్లా పరిశ్రమ వర్గాలు రూపొందిస్తున్నాయి. గతంలో మాదిరిగా పాలిస్టర్ కాకుండా ఈ సారి కాటన్ నూలును కూడా వినియోగిస్తున్నారు. దీంతో రెండు రంగాల వారికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మరమగ్గాల వస్త్రోత్పత్తులున్న ప్రాంతాల నుంచి వివిధ రకాల డిజైన్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఉన్నతాధికారుల పరిశీలనకు ఉంచారు. నూలు వినియోగం, డిజైన్ల ఎంపికపై స్పష్టత వచ్చాకే ఆర్డర్లు ఎలా ఇవ్వాలనేది తెలుస్తుంది.

☛ బతుకమ్మ చీరల ఆర్డర్లలో సరైన ప్రణాళిక లేకపోవడం, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పూర్తిగా ఆ ఉత్పత్తులవైపే తీసుకెళ్లడంతో దశాబ్దాలుగా ఇక్కడికి వస్తున్న ఇతర రాష్ట్రాల ప్రైవేటు ఆర్డర్లు రాకుండా పోయాయి. దీంతో ఈ ఏడాది వస్త్ర పరిశ్రమ పూర్తిగా కుదేలైంది.



జరీ అంచుతో చీరలు

☛ ప్రభుత్వం నిర్ణయించిన డిజైన్లకు తగ్గట్టుగా ఉన్న మరమగ్గాలపై మాత్రమే చీరలను నేపించనున్నారు. ఇక్కడే కాకుండా టెక్స్‌టైల్‌పార్కు, కరీంనగర్‌తోపాటు రాష్ట్రంలో మరమగ్గాలున్న జిల్లాలన్నింటికీ ఆర్డర్లు ఇవ్వనున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని వస్త్రోత్పత్తి నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయి. ఆసాములు, కార్మికులకు చేతినిండా పని ఉంటుంది.

☛ ప్రభుత్వ ఆర్డర్లలో కాటన్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని కొన్నేళ్లుగా వినతులు వెళ్తూనే ఉన్నాయి. ఈసారి ఆ రంగానికి చెందిన వారు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులను కలిసి తాము తయారు చేసిన నమూనాలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

☛ ప్రస్తుతం వస్త్రోత్పత్తిదారుల సొంత ఆర్డర్లకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఉత్పత్తులు చేసుకునేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు.

☛ ఒక చీర జాకెట్‌తో కలిపి 6.3 మీటర్లు ఉంటుంది. అందులో 45 శాతం కాటన్, 55 శాతం పాలిస్టర్ కలిపి ఇవ్వడంతో ఆకర్షణీయమైన డిజైన్లు తీసుకురావచ్చు. ఇలా చేయడం ద్వారా ప్రాసెసింగ్ అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేయవచ్చు. దీంతో సైజింగ్ యూనిట్లకు ఉపాధి లభిస్తుంది.

☛ జిల్లాలో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 25,494 ఉన్నాయి. వీటిపై కాటన్, పాలిస్టర్ రెండు రకాల వస్త్రోత్పత్తులు తయారవుతాయి. అయితే ఇప్పటి వరకు ఇచ్చే ప్రభుత్వ ఆర్డర్లు అన్నీ పాలిస్టర్ రంగానికే పరిమితం కావడంతో కాటన్ రంగం పూర్తిగా కుదేలైంది. సిరిసిల్లలో పదేళ్ల క్రితం 32 సైజింగ్ యూనిట్లు ఉంటే ప్రస్తుతం 16కు చేరుకోవడమే ఇందుకు నిదర్శనం. 40కిపైగా ఉండే డైయింగ్ (అద్దకం) యూనిట్లు పదికి పరిమితమయ్యాయి.

కోడెల పంపిణీపై ఆశలు

2,500 మంది ఎదురుచూపు

న్యూస్‌టుడే, వేములవాడ

దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెల పంపిణీ కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వందల మంది దరఖాస్తు చేసుకొన్నారు. వీరంతా నిరీక్షణ జాబితాలో ఉండటంతో తమకు ఎప్పుడు ఇస్తారని ఆరా తీస్తున్నారు.

రాజన్నను దర్శించుకున్న భక్తులు కోడె మొక్కులు చెల్లిస్తుంటారు. దీంతో పాటు మరి కొందరు నిజ కోడెలను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు సమర్పించిన వాటిని ఆలయ అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు.



తిప్పాపూర్ గోశాలలో రాజన్న కోడెలు

★ కోడెల సంఖ్య పెరిగిపోయి సంరక్షణకు ఇబ్బందికరంగా మారడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జులై 3న అర్హులైన రైతులకు అధికారులు ఉచితంగా పంపిణీ చేశారు.

★ దాదాపు 700 మంది రైతులకు ఒక జత కోడెలు అందజేశారు. రైతుల కోరిక మేరకు కొందరికి ఆవులను ఇచ్చారు. ఇంకా అనేక మంది ఆన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా అధికారులకు దరఖాస్తులు సమర్పించారు.

పర్యవేక్షణ కరవు

రాజన్న గోశాల నుంచి జులై 3 నుంచి 10 వరకు దాదాపు 700 మంది రైతులకు కోడెలు, ఆవులను పంపిణీ చేశారు. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నా ఏ ఒక్క అధికారి కూడా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించిన దాఖలాలు లేవు. పంపిణీ చేసిన కోడెల సంరక్షణ ఎలా ఉందనేది ఎవరికీ తెలియదు. ఏమైనా పక్కదారి పట్టాయా అనే సమాచారం కూడా అధికారుల వద్ద లేదు.

● పంపిణీ చేసిన నెల రోజుల తరవాత వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి సంరక్షణపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా పరిశీలించి కోడెలు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.

భారీగా దరఖాస్తులు పెండింగ్

★ ఉచిత కోడెల పంపిణీ సందర్భంగా భారీ సంఖ్యలో రైతులు తరలి వచ్చి తమకు ఇవ్వాలని దరఖాస్తులు సమర్పించారు. దాదాపు 2,500 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

★ ప్రస్తుతం గోశాలలో 500 వరకు కోడెలు, మరో 60 వరకు ఆవులు ఉన్నాయి.

★ శ్రావణ మాసంలో అనుకున్న స్థాయిలో స్వామివారికి నిజ కోడెలను సమర్పించలేదు. దీంతో గోశాలలో వీటి సంఖ్య తగ్గింది.

★ ప్రస్తుతం గోశాలలో ఉన్న కోడెలు, ఆవుల నుంచి దాదాపు 300 పంపిణీ చేయడానికి అవకాశం ఉంది.

★ కొన్నింటిని వచ్చే నెలలో పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. క్రమ సంఖ్య ప్రకారం పంపిణీ చేయాలని నిర్ణయించారు. మిగతా వారికి గోశాలకు వచ్చే వాటిని బట్టి దశల వారీగా అర్హులైన రైతులకు ఇవ్వాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

పక్కదారి పడితే చర్యలు

అర్హులైన రైతులకు ఉచితంగా పంపిణీ చేసిన కోడెలను పర్యవేక్షణ చేయాల్సి ఉంది. పని ఒత్తిడి కారణంగా చేయలేకపోయాం. ఫోన్ ద్వారా తెలుసుకొంటాం. ఇప్పటికైతే కోడెలు పక్కదారి పట్టినట్లు సమాచారం లేదు. వాటిని అమ్మడం, ఇతరులకు ఇవ్వకూడదని పంపిణీ సమయంలో రైతుల నుంచి పంచనామా తీసుకొన్నాం. పక్కదారి పట్టినట్లు నిర్ధారణ అయితే చర్యలు చేపడతాం.

- శ్రీనివాస్, ఏఈవో, ఆలయ గోశాల ఇన్‌ఛార్జి

ఆలయ పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ జాతరగ్రౌండ్‌లోని వసతి గదుల ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను అధికారులు బుధవారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువను ఆక్రమించి ఇష్టారాజ్యంగా దుకాణాలు, తోపుడు బండ్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు. దీంతో ఆలయానికి వచ్చి పోయే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు చర్యలకు ఉపక్రమించారు. ఈవో వినోద్ రెడ్డి, అధికారులు పరిశీలించి ఆక్రమణలను తొలగించారు. కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా సామగ్రిని తరలించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆక్రమణలతో 40 అడుగుల రహదారి 15 అడుగులకు కుదించుకుపోయి భక్తులు, స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలువలను ఆక్రమించడంతో మురుగు ముందుకు వెళ్లక రోడ్డుపైకి వస్తుందని పేర్కొన్నారు. ఆ మురుగులో నడుచుకుంటూ స్వామివారి దర్శనానికి రావాల్సి వస్తుందని భక్తులు చెప్పడంతో ఆక్రమణలను గుర్తించి తొలగించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, విజయ్, పర్యవేక్షకులు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. నియోజకవర్గ స్థాయి సమీక్షాసమావేశాన్ని మర్రిపల్లిలో బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రాబోయే బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘనంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జాప్యం వల్ల ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందని చెప్పారు. గ్రామాల్లో సమస్యలుంటే పరిష్కరించి, పండగ నాటికి సరైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం, అధికారులు ప్రజలు చెప్పేది వింటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రధాన కూడళ్లలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందించే సలహాలు పాటించాలని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో జాప్యం లేకుండా చూడాలని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల పేర్లు, ఫోన్ నంబరుతో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీపీవో శేషాద్రి, డీఎల్‌పీవో గీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

రహదారి ఇలా... రాకపోకలు ఎలా?

ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది శివారు సేవాలాల్‌తండాకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలిచింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో ప్రజలు రాత్రనక, పగలనక రాకపోకలు సాగిస్తుంటారు. గీత కార్మికులు, రైతులు వచ్చి పోతుంటారు. రాత్రి వేళలో వాహనదారులు అదుపు తప్పి గుంతల్లో కూరుకుపోయే ప్రమాదముందని వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకొని మట్టి పోసి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ముస్తాబాద్**



కట్టుదిట్టంగా లడ్డూ ప్రసాదం

- తితిదే ఘటనతో దేవాదాయశాఖ అప్రమత్తం
- ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ



ధర్మపురి దేవస్థానం లడ్డూ ప్రసాదం

న్యూస్‌టుడే, ధర్మపురి, వేములవాడ, మల్యాల

ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి దేవస్థానాల లడ్డూ, పులిహోర ప్రసాదాలను భక్తులు పరమ పవిత్రంగా భావించి కొనుగోలు చేస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో లడ్డూ తయారీలో తప్పిదం జరిగిందని ఆరోపణలు రావడంతో రాష్ట్ర దేవాదాయశాఖ అప్రమత్తమైంది.. ప్రధాన ఆలయాల్లో దిట్టం ఉత్తర్వులను తూచా తప్పకుండా పాటించాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు.. రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో విజయ తెలంగాణ డెయిరీ నెయ్యిని మాత్రమే వినియోగించాలని ఉత్తర్వులు జారీ చేశారు.



కొండగట్టులో లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం

ధర్మపురిలో రోజుకు 2 వేల విక్రయం

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లడ్డూ ప్రత్యేకంగా నిలుస్తోంది. 80 గ్రాముల లడ్డూ ప్రసాదానికి రూ.20, 200 గ్రాముల పులిహోర ప్రసాదానికి రూ.15 తీసుకుంటున్నారు. ప్రతిరోజు సరాసరి 2 వేలలు, శని, ఆదివారాలు 3 నుంచి 5 వేల వరకు లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తారు. దిట్టం సామగ్రిని ఉప ప్రధాన అర్చకుడు, సంబంధిత స్టోర్ ఇన్‌ఛార్జి, ఈవో ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. 10 కిలోల లడ్డూ ప్రసాదానికి 7 కిలోల నెయ్యి, 20 కిలోల చక్కెర, కాజు 700 గ్రాములు, కిస్‌మిస్‌లు 750 గ్రాములు, యాలకులు 100 గ్రాములు, కర్పూరం 10 గ్రాములు, జాజికాయ 10 గ్రాములు, మిస్రీ 500 గ్రాములు వినియోగిస్తున్నామని అధికారులు చెప్పారు. 2023 - 24 సంవత్సరానికి లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,50,20,00, పులిహోర ప్రసాదం ద్వారా రూ.54,69,750 ఆదాయం సమకూరింది. ఈవో సంకటాల శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మపురి దేవస్థానంలో లడ్డూ ప్రసాదాల విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నామని, ప్రస్తుతం కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజన్న ఆలయానికి రూ.20 కోట్ల ఆదాయం

వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ప్రత్యేకంగా స్వామివారి ప్రసాదం లడ్డూలను మహా ప్రసాదంగా భావించి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. లడ్డూల తయారీని ఒక ఏఈవో, పర్యవేక్షకుడు, సిబ్బంది తనిఖీ చేస్తారు. భక్తుల రద్దీ అంచనాతో లడ్డూలను తయారు చేస్తుంటారు. దాదాపు ప్రతి నెల 10 నుంచి 15 వేల కిలోల నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగిస్తుంటారు. ఆలయానికి ఏడాదికి రూ.20 కోట్ల ఆదాయం లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా సమకూరుతోంది. కిలో లడ్డూ తయారీకి 650 గ్రాముల నెయ్యి వినియోగించాల్సి ఉంటుంది. ఆలయానికి సరఫరా అయ్యే నెయ్యికి ఆరు నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుంది. అందుకు అనుగుణంగానే నాణ్యమైన నెయ్యిని లడ్డూల తయారీలో వినియోగిస్తున్నామని ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల అనిశా అధికారుల తనిఖీ సమయంలో తూనికలు, నాణ్యత ప్రమాణాల అధికారులు నెయ్యి నమూనా కూడా తీసుకెళ్లారని చెప్పారు.



వేములవాడ లడ్డూ తయారీలో మహిళా కార్మికులు

కొండగట్టులో ఏటా 50 వేల కిలోల నెయ్యి వినియోగం

కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులు లడ్డూతో పాటు పులిహోర ప్రసాదం కొనుగోలు చేస్తుంటారు. శని, మంగళవారాల్లో దాదాపు 15 వేల లడ్డూలు, 5 క్వింటాళ్ల పులిహోర తయారు చేసి విక్రయిస్తుంటారు. 100 గ్రాముల లడ్డూ రూ.25కు, 200 గ్రాముల పులిహోర రూ.20లకు విక్రయిస్తుంటారు. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నా.. పులిహోర తయారీకి ఖర్చు తక్కువ కావడంతో 75 శాతం లాభం ఈ ప్రసాదం ద్వారానే సమకూరుతుందని అధికారులు చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై వివాదం నేపథ్యంలో కొండగట్టు అంజన్న ఆలయానికి సరఫరా చేస్తున్న నెయ్యిని కూడా పరీక్షలు చేయిస్తామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. లడ్డూ తయారీకి ప్రతి నెలా 4 వేల కిలోల చొప్పున, ఏడాదికి 50 వేల కిలోల వరకు నెయ్యిని ఖరీదు చేస్తున్నట్లు చెప్పారు.

వరుస తనిఖీలు... వణుకుతున్న అధికారులు

విద్య, వైద్యంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

జిల్లాలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వరుసగా ఆకస్మిక తనిఖీలు చేస్తుండటంతో అధికారులు, ఉపాధ్యాయులు, వైద్యులు, ఇతర ఉద్యోగులు వణుకుతున్నారు. ప్రధానంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులను సందర్శిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించి వారి నుంచి సమాధానాలు రాబడుతున్నారు. అదే సమయంలో వారికి కావాల్సిన సౌకర్యాలు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్నారు. తద్వారా ఉద్యోగులు సమయపాలన పాటించడంతోపాటు పని తీరు మెరుగు పడేందుకు ఆస్కారం ఏర్పడింది.

● వేములవాడ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, మూత్రశాలలు, వంటగది తదితర వాటిని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గణితం, సామాన్యశాస్త్రం, ఆంగ్లంలో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.



వేములవాడ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో బోధిస్తూ...

● వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలోని సదరం శిబిరాన్ని సందర్శించి ఆర్థో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకొన్నారు.

● కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే రెండు మూత్రశాలలు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎంపీడీవోను ఆదేశించారు.

● తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన సంక్షేమ విద్యాలయంలోని పీఈటీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ బాలికలు ఆందోళన చేశారు. కలెక్టర్ అక్కడికి చేరుకుని వెంటనే పీఈటీ తొలగింపునకు ఆదేశాలు ఇచ్చారు. తరవాత ప్రిన్సిపల్‌ను సస్పెండు చేశారు.

● గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు చేస్తున్న పరీక్షల తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిలోని లింగన్నపేట, గంభీరావుపేట మధ్యలో మానేరువాగుపై నిర్మిస్తున్న తాత్కాలిక రోడ్డు పనులపై ఆరా తీశారు.

● తంగళ్లపల్లి మండలం కేసీఆర్ కాలనీని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.



తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

● ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత, అక్కపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కట్టెల పొయ్యిపై ఆహార పదార్థాలను తయారు చేయవద్దని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు.

ప్రత్యేక అధికారుల నియామకం

జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో మౌలిక వసతులపై తనిఖీ చేయడానికి 21 మంది జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నోడల్ అధికారిగా జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌ను నియమించి నివేదికలు ఆయనకు ఎప్పటికప్పుడు పంపించాలని అందులో పేర్కొన్నారు. దీంతో వీరంతా వారికి కేటాయించిన వాటిని సందర్శిస్తున్నారు.

శ్మశానవాటికకు మార్గం సుగమం

ఈనాడు స్పందనకు వందనం

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మల్కాపేటలో శ్మశానవాటికకు వెళ్లే మార్గం కోసం ఇచ్చిన భూమికి ప్రభుత్వం నుంచి పరిహారం రాకపోవడంతో రైతు దారిని మూసివేయడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈ నెల 24న 'ఈనాడు'లో 'శ్మశానవాటికకు దారేది?' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి కంచర్ల రమేశ్ పట్టాదారుతో చర్చించిన అనంతరం పంచాయతీ సిబ్బందితో దారికి అడ్డుగా వేసిన ముళ్లు, చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. దీంతో రాకపోకలకు సౌకర్యంగా మారింది.



దారిలో తొలగించిన ముళ్ల చెట్ల కొమ్మలు

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర గోడపత్రిక ఆవిష్కరణ

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలో అక్టోబర్ 9 నుంచి 19 వరకు జరిగే శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో రమేశ్ సమావేశం నిర్వహించారు. అనంతరం జాతర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతి, అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, శ్రీనివాస్, వేదపండితులు పాల్గొన్నారు.

మిషన్ 1000

● రోడ్డు భద్రతపై అవగాహన ● నేటితో ముగింపు


వాహనదారుడికి సూపర్ హీరో కార్డు అందజేస్తున్న దృశ్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రహదారి నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో 'ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్, సాఫేర్ ఇండియన్ సంస్థ' ఆధ్వర్యంలో 'బీసేఫ్.. డ్రైవ్ సేఫ్.. రీచ్ సేఫ్..' నినాదంతో వెయ్యి రోజులపాటు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించే కార్యక్రమానికి జనవరి 1, 2022న శ్రీకారం చుట్టగా ఈ నెల 26తో ఈ కార్యక్రమం ముగియనుంది.

రోజూ కార్యక్రమాలు

- కరీంనగర్‌లో బస్టాండ్ చౌరస్తాలో వాహనదారులకు ప్రతిరోజు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు.
- నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం, సురక్షిత ప్రయాణానికి ఎలా డ్రైవింగ్ చేయాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, లైసెన్స్ ప్రాముఖ్యం తదితర అంశాలను వివరించారు.
- హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకున్న వారికి పూలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.
- సూపర్ హీరో పేరుతో ముద్రించిన కార్డు, బహుమతులు అందజేశారు.
- రహదారి నిబంధనలు, సిగ్నల్స్ వాటి ఉపయోగం, యూటర్న్, వేగం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుంటే జరిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
- మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.
- ఆటో చోదకులకు యూనిఫాంలు కూడా అందజేశారు.
- విద్యార్థి స్థాయి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రధాన లక్ష్యాలు ఇవే..

- ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి.
- మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. నడిపితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి.
- రహదారి నిబంధనలు, సిగ్నల్స్ వ్యవస్థ, ఇతర అంశాలపై అవగాహన లేని వారికి లైసెన్స్‌లు జారీ చేయకూడదు.
- ట్రామాకేర్ సెంటర్లు అందుబాటులో ఉండాలి.
- రహదారి భద్రతపై రోడ్డు సేఫ్టీ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలి.
- రోడ్డు సైన్స్‌ను పాఠ్యాంశంగా చేర్చాలి.

ప్రమాద రహిత ప్రయాణమే ధ్యేయం

సంస్థ వెయ్యి రోజుల కార్యక్రమంలో చాలా మందికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన లేదని గుర్తించాం. రహదారి నియమావళిపై కశ్మీర్‌లోనూ ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించాం. భవిష్యత్తులో సంస్థ పక్షాన మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం. ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

\- ఘన శ్యామ్ ఓజా, సంస్థ అధ్యక్షుడు

హత్య కేసులో ఇద్దరికి జైలు



సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ గ్రామానికి చెందిన పండుగ రాజంకు, తన అక్క మరియమ్మతో ఆస్తుల పంపకంపై గొడవలు జరిగాయి. ఈక్రమంలో 2020 సెప్టెంబరు 1న పండుగ మరియమ్మ, ఆమె కుమారుడు పండుగ మల్లేశంలు పండుగ రాజంను గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో మరియమ్మకు పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా, మల్లేశంకు జీవిత ఖైదుతోపాటు రూ. 2,500 జరిమానాను ప్రధాన న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

శిక్షణ శిబిరం.. విద్యార్థులకు ఉపయోగం

సామాజిక స్పృహ, క్రమశిక్షణకు ప్రాధాన్యం


గుడారం ఏర్పాటు చేస్తున్న స్కౌట్స్ విద్యార్థినులు

న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)

విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక స్పృహ పెంపునకు స్కౌట్స్ అండ్ గైడ్స్ వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. పాఠశాల దశలోనే వారిలో క్రమశిక్షణ, వ్యక్తిత్వ, శారీరక వికాసానికి కృషి చేస్తోంది. క్షేత్రస్థాయిలో వివిధ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని స్కౌట్స్ యూనిట్‌లో ఉన్న విద్యార్థులకు గోదావరిఖని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అయిదు రోజుల పాటు తృతీయ సోపాన్ శిబిరంలో శిక్షణిస్తున్నారు. విద్యార్థులు చురుగ్గా పాల్గొని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. వారి అభిప్రాయాలు, లక్ష్యాలతో 'న్యూస్‌టుడే' కథనం.

18 పాఠశాలల్లోనే అమలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 450పైనే ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ తప్పనిసరిగా అమలు చేయాలనే విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లు అన్ని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం 18 పాఠశాలల్లోనే అమలవుతోంది. ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడితేనే ఉమ్మడి జిల్లాలో అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

రాష్ట్రపతి అవార్డు పొందాలనుంది



స్కౌట్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రపతి అవార్డు పొందాలనుంది. గత రెండు సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నా. ప్రస్తుతం శిక్షణ శిబిరంలో టెంటు కట్టడం, మార్చ్ ఫస్ట్, శ్రమదానం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నా. శిక్షకుల మార్గదర్శకంలో రాజ్యపురస్కార్ శిక్షణ శిబిరంలో పాల్గొనే దిశగా కసరత్తు మొదలుపెడుతున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తృతీయ సోపాన్‌లో మంచి ప్రతిభ కనబరిచాను.

విశ్వశ్రీ, 8వ తరగతి, కరీంనగర్

పాత్రలు లేకుండా వంట చేశాం



స్కౌట్స్ ద్వారా ఇతరులకు సేవ చేయడం, పెద్దలను గౌరవించడం, వృద్ధులను చేరదీయడం తదితర లక్షణాలు అలవడ్డాయి. శిక్షణ శిబిరంలో అటవీ ప్రాంతాల్లో తప్పిపోతే ఏం చేయాలో నేర్పుతారు. తృతీయ సోపాన్ శిబిరంలో శిక్షకులు మొదట పాత్రలు ఇవ్వకుండా కూరలు వండాలని సూచించారు. దీంతో ఇటుక, మట్టి, కట్టెల మంటతో వంట చేశాం.

రష్మిత, 9వ తరగతి, సుల్తానాబాద్, కేజీబీవీ

గైడ్ కెప్టెన్ కావడమే లక్ష్యం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి తృతీయ సోపానాలను పూర్తి చేసుకున్నా. రాష్ట్రపతి క్యాంపులో పాల్గొని అవార్డు అందుకోవాలన్నదే నా కోరిక. శిక్షణలో సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోగలుగుతాం. స్కౌట్స్ గైడ్ కెప్టెన్ అవ్వడమే లక్ష్యం.

వర్షిణి, 7వ తరగతి, గోదావరిఖని

క్రమశిక్షణకు మారుపేరు



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగి ఉంటారు. ఇతర భాషలు, ఆచార కట్టుబాట్లు, సంస్కృతులపై అవగాహన ఉంటుంది. సమకాలీన అంశాలు తెలుసుకుంటారు. ప్రతిభ కనబరిస్తే రాష్ట్రపతి, గవర్నర్‌ల నుంచి అవార్డు పొందే సువర్ణ అవకాశం లభిస్తుంది.

సూర్యదేవర జ్యోతి, జిల్లా గైడ్ కమిషనర్

పలుకుల చిలుక.. అదిరింది నీ ఆవాసం



తాటి కల్లుకు ఉపయోగపడని చెట్లను రామచిలుకలు తమ నివాసంగా మార్చుకున్నాయి. మానకొండూర్ పరిధి చెంజర్ల సమీపంలోని జాతీయ రహదారి వెంబడి రేణుక ఎల్లమ్మ ఆలయం ఎదుట ఉన్న తాటి చెట్లకు.. కొన్ని చిలుకలు రంధ్రాలు చేసుకొని ఉంటున్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

\- న్యూస్‌టుడే, మానకొండూర్

నీ బిడ్డ నీలగౌరి.. నిత్య మల్లె చెట్టేసి!



'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా.. కోల్' అంటూ సాగే పాటలతో మంథని పట్టణంలో వాడవాడలా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అయిదు రోజులుగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్ర ధారణతో భక్తిశ్రద్ధలతో బొడ్డెమ్మను పూజిస్తున్నారు. చెరువు మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి, ప్రత్యేక వేదికపై ఉంచి ధూప దీప నైవేద్యాలు నివేదిస్తున్నారు. బొడ్డెమ్మ చుట్టూ ఆడిపాడుతున్నారు. -న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

అధిక సాంద్రతపై అన్నదాతల ఆశలు

పత్తి దిగుబడులపై శాస్త్రవేత్తల భరోసా

న్యూస్‌టుడే, హుజూరాబాద్

ప్రస్తుత సీజన్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేసిన రైతులు దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గతేడాది వానాకాలం సీజన్‌లో ఇదే పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేసినా ఆశించిన ఫలితం రాలేదు. దిగుబడులు ఎక్కువ వస్తాయని వ్యవసాయాధికారులు ప్రోత్సహించినా.. తీరా పంట చేతికొచ్చే సరికి నిరాశే ఎదురైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి సాగులో మెలకువలు పాటించి దిగుబడులు పెరిగేలా.. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

గతేడాది నామమాత్రంగానే..

జిల్లాలో గతేడాది 195 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేశారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా ఎకరాకు 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు ప్రోత్సహించడంతో రైతులు ముందుకొచ్చారు. తీరా పత్తి చేతికి వచ్చేసరికి ఎకరాకు అయిదు నుంచి ఏడు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఒక్క సైదాపూర్ మండలంలోనే 25 మంది రైతులు 36 ఎకరాలు సాగు చేయగా అందరికి 5-7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అయితే గతేడాది అధిక వర్షాలు, వాతావరణ అనుకూలించక పోవడంతో ఆశించిన దిగుబడులు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అందని ఆర్థిక ప్రోత్సాహం

సాధారణ సాగుతో పోలిస్తే అధిక సాంద్రత సాగులో పెట్టుబడి ఎక్కువ. అందుకే ఆర్థిక ప్రోత్సాహం కింద అదనపు పెట్టుబడిని ఎంపిక చేసిన రైతులకు ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధానంలో ఒక్కో రైతుకు ఎకరాకు రూ. 3,400 నుంచి రూ. 4,980 చొప్పున చెల్లించేలా వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. కానీ ఏడాది దాటినా నేటికీ అందకపోవడం రైతులను నిరాశకు గురిచేసింది. రైతుల బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని.. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.


సైదాపూర్‌లో అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తి

469 ఎకరాల్లో సాగు..



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అధిక సాంద్రత విధానంలో 524 ఎకరాల్లో సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్రామాలు, రైతుల ఎంపిక, సాగు బాధ్యతను ఈసారి జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలకు అప్పగించింది. జిల్లాలోని 44 గ్రామాల్లో మొత్తం 10 విభాగాల్లో ఎంపిక చేసిన వివిధ కంపెనీల విత్తనాలతో అధిక సాంద్రత విధానంలో 315 ఎకరాలు, మధ్యస్థ సాంద్రత పద్ధతిలో 154 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా 469 ఎకరాల్లో పత్తి సాగయ్యేలా రైతులను ప్రోత్సహించారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు

రైతులు సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవడంతో పాటు సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలి. ఈసారి ఎకరా పత్తికి 11-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. భవిష్యత్తులో సాగు విస్తీర్ణం పెంచాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.


\- డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

పెరుగుతున్న పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. యార్డుకు బుధవారం 30 ట్రాలీల కొత్త విడిపత్తి, 11 ట్రాలీల పాత విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్ కొత్త విడిపత్తి రూ. 6,000 నుంచి రూ. 6,850 దాకా.. పాత విడిపత్తి రూ. 7,000 నుంచి రూ. 7,600 వరకు ధర పలికింది. 75 క్వింటాళ్ల బస్తాల కొత్త పత్తి విక్రయానికి రాగా రూ. 6,000 నుంచి రూ. 6,800 వరకు వ్యాపారులు ధర నిర్ణయించారు. కొత్త విడిపత్తి మంగళవారం కంటే తాజాగా రూ. 211లు తగ్గినట్లు మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం తెలిపారు. కొత్తపత్తి అధిక తేమతో ఉండటంతోనే ధర పడిపోయిందని చెప్పారు.

30న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఈ నెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్. ప్రభాకర్, కోచ్ వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

అన్ని దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేయాలి

వేములవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వేములవాడ పట్టణంలో యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగుల ఐకాస సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి రమేశ్‌బాబు అధ్యక్షతన జరిగింది. దీనికి జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెద్ద దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేసి చిన్న దేవాలయాలకు చేయలేదని పేర్కొన్నారు. 261 జీవో సవరణ చేసి ఉద్యోగులందరికీ ఒకే రకమైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయాల్లో భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను పెంచాలన్నారు. ఆలయాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం ఉన్నా తమ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మిర్యాల నాగేందర్‌రెడ్డి, పరమేశ్వర్, వేముల ప్రభాకర్, బుద్ధి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు దయాకర్‌రెడ్డి, భాస్కర్, సాయి, హరికిషన్, కృష్ణ, ఉమేశ్‌శర్మ, నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు కపీంద్రాచారి, మదన్‌కుమార్, అర్చకులు, వివిధ ఆలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు రాజన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.

శ్రీరామసాగర్‌కు స్థిరంగా వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 33,238 క్యూసెక్కుల చొప్పున వరదనీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 18 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. 2 స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది.

మధ్యమానేరుకు..

బోయినపల్లి : రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయానికి వరద కొనసాగుతుంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 9,259 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రమాదాల కట్టడికి చర్యలు

● ఆర్టీసీలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు


జగిత్యాల డిపోలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆర్టీసీ సంస్థ డ్రైవర్లు, కండక్టర్లకు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తోంది. కొందరు మద్యం తాగి బస్సులు నడుపుతున్న ఘటనలు దృష్టికి రావడంతో పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి చేసింది. డ్రైవర్లు, కండక్టర్లను పరీక్షించిన తరువాతనే విధుల్లోకి తీసుకొని బస్సులను అప్పగించే విధానం అమలు చేస్తున్నారు. కరీంనగర్ జోన్‌లోని మొత్తం 39 డిపోల్లో కలిపి ఆర్టీసీ బస్సులు 2242, ప్రైవేటు 1347 మొత్తం కలిపి 3589 బస్సులు ఉన్నాయి. ఇవి రోజుకు సగటును 15.94 లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి చేరవేస్తున్నాయి. ఒక బస్సు అంటే 60 కుటుంబాలనే భావనతో ప్రయాణికులను క్షేమంగా ఇంటికి చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

విధుల నుంచి తొలగింపు

మద్యం తాగి బస్సులు నడపకుండా పరీక్షలు నిర్వహించడంతోనే సరిపెట్టకుండా మరోసారి పునరావృతం కాకుండా ఆర్టీసీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. పరీక్షల ఫలితాలు తదితరాలపై విచారణ జరిపి సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు వెనుకాడటం లేదు. జగిత్యాల డిపో పరిధిలో ఇప్పటి వరకు 17 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఆర్టీసీకి చెందిన ఆరుగురు డ్రైవర్లు, ఒక కండక్టర్, మరో ఇద్దరు మెకానిక్‌లు, అద్దె బస్సులకు చెందిన నలుగురు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, ఇద్దరు మెకానిక్‌లు మద్యం తాగి విధులకు హాజరైనట్లు గుర్తించారు. వీరిలో పలువురిని విధుల నుంచి తొలగించగా తక్కిన కేసులు విచారణలో ఉన్నాయి.

రెండేళ్లలో 255 కేసులు

మద్యం తాగి విధులకు హాజరవుతున్న తీరుపై ఆర్టీసీ సంస్థ కఠినంగా వ్యవహరించడం సత్ఫలితాలు ఇస్తోంది. విజిలెన్స్ విభాగం ద్వారా పటిష్ఠ నిఘా అమలు చేయడంతో క్రమంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గుతున్నాయి. ప్రతి డిపో వద్ద మొదట బస్సు బయలుదేరే సమయంలో, ఆ తరువాత మధ్యలో ఎక్కడా మద్యం తాగినా గుర్తించే విధంగా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇలా సగటున రోజుకు 80 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతేడాది 39 డిపోల్లో కలిపి ఆర్టీసీ సంస్థకు సంబంధించి 52 కేసులు నమోదు కాగా అద్దె బస్సులకు చెందినవి 94, మొత్తం కలిపి 146 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఆర్టీసీలో 57, అద్దె బస్సులకు సంబంధించి 52, మొత్తం కలిపి 102 కేసులు నమోదు చేశారు.

సిబ్బంది సంక్షేమానికి శ్రీకారం

సంస్థ సిబ్బంది సంక్షేమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. తాజా గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ పేరిట కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అన్ని రకాల వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రధానంగా గుండెకు సంబంధించిన టుడీఎకో, నేత్ర పరీక్షలు, ఛాతి తదితర పరీక్షలు చేయించి సిబ్బంది ఆరోగ్యం విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించింది. బస్సుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ లేనందున తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా సంస్థ అన్ని విధాలా కృషి చేస్తోంది. ఇందులో బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు ఒక భాగం. ఆర్టీసీ లక్ష్యాలు, ప్రాథమ్యాలు, నిబంధనలు ఆకళింపు చేసుకొని సిబ్బంది సంస్థ అభివృద్ధికి తమవంతుగా సహకరిస్తున్నారు. భవిష్యత్తులోనూ జగిత్యాల డిపోను మునుపటిలా మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తాం.

\- సునీత, డీఎం, జగిత్యాల

బిల్లుల విడుదలకు కృషి చేయాలి

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి చేయాలని కోరుతూ బుధవారం భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌ను మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. 2010 నుంచి 2024 వరకు చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పటి వరకు విడుదల కాలేదని, ఇప్పటికైనా మీరు చొరవ తీసుకొని విడుదలకు కృషి చేయాలని వారు కోరారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు మొత్తం వెంటనే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు మాట్ల మధు, రాజేందర్, బీరప్ప, కరుణాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటలకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి, మద్దిమల్ల, సీతారాంనాయక్‌తండా తదితర గ్రామాల్లో వివిధ కారణాలతో పలువురు కార్యకర్తలు మృతి చెందగా వారి కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భారాస జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు రవి, సంతోష్, రఫీ, లక్ష్మణ్, దేవయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి వేడుకలు జయప్రదం చేయండి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. సిరిసిల్లలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఈనెల 26న ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నాయకురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, నాయకులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగుల రాములు, పంతం రవి, మూషం రమేశ్, బుస్స వేణు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ...

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని సిరిసిల్ల పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంత్యుత్సవం కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ నెల 27న జరిగే కొండా లక్ష్మణ్ బాపూజీ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, జిందం చక్రపాణి, మ్యాన రవి, గూడూరి ప్రవీణ్, సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిరిసిల్ల పురపాలక సంఘం కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ పేర్కొన్నారు. ఈ నెల 17 అక్టోబర్ 2 వరకు జరుగుతున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పెద్ద బోనాలలో బుధవారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బృందం, అసిస్టెంట్ ఇంజినీర్ల బృందం తలపడగా కమిషనర్ బృందం విజయం సాధించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరసింహస్వామి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రమ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం


అక్కపల్లిలో గర్జనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: విహారయాత్రలతో విద్యార్థుల్లో సామాజిక విజ్ఞానం పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం రంగంపేట అక్కపల్లి జలాశయాన్ని సందర్శించారు. ఆలయ చరిత్ర, ఏడాదంతా పారే నీరు గురించి ఉపాధ్యాయులు బాలబాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, ప్రేమ్‌సాగర్, బలరాంనాయక్, మంజుల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను బుధవారం కలిశారు. మండల కేంద్రంతో పాటు రాచర్ల గొల్లపల్లిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. 1993లో మండల కేంద్రం పరిధిలోని కిషన్‌దాస్‌పేట నుంచి సింగారం నంది విగ్రహం వరకు బీటీ రహదారి, మంగలయ్య కాల్వ నుంచి పోచమ్మ ఆలయం వరకు కాల్వ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మూత్రశాలల నిర్మాణానికి సహకరించాలని వినతిపత్రంలో కోరారు. ఆయన వెంట నాయకులు బుచ్చి లింగు, సంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భవనం మిగులు పనులకు భూమిపూజ

బండలింగంపల్లి(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో గౌడ సంఘం భవన నిర్మాణ మిగులు పనులకు స్థానిక నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. నిధులు లేక అర్ధంతరంగా నిలిచిపోగా దాన్ని పూర్తి చేయాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. రూ. 5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి బాలరాజు నర్సాగౌడ్, ఉపసర్పంచి, నాయకులు వెంకటేశ్, హైమద్, రాములు, గౌడ సంఘం సభ్యులు, భారాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

చందుర్తి, న్యూస్‌టుడే: చందుర్తి మండలంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో నూతన విద్యుత్ నియంత్రికను సెస్ చైర్మన్ రామారావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ ఏఈ మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక ప్రగతి

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన బ్యూటీ పార్లర్, అర్బన్ మండలంలో ఏర్పాటు చేసిన డెయిరీ పార్లర్, లేడీస్ ఎంపోరియంలను ప్రారంభించారు. ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా, కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు, అర్బన్ మండలాధ్యక్షుడు కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది కూలగొట్టి.. కొత్తది కట్టక

ప్రయాణ ప్రాంగణం లేక ఇబ్బందులు

న్యూస్‌టుడే, తంగళ్లపల్లి

కొందరు ఫిర్యాదు మేరకు ఉన్న ప్రయాణ ప్రాంగణాన్ని కూల్చివేశారు. తరవాత వేరేచోట కడతామని చెప్పిన అధికారులు సంవత్సరాలు తరబడినా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోనే తంగళ్లపల్లి పెద్ద గ్రామ పంచాయతీ. 1990లో గ్రామంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్న బస్టాండ్ నిర్మించారు. అయితే దీనికి సమీపంలోనే మసీదు ఉంది. బస్టాండ్‌కు సంబంధించిన మూత్రశాలల నుంచి దుర్వాసన వస్తుందని కొందరు ముస్లింలు ఫిర్యాదు చేయడంతో ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ఏఈ జబ్బర్ కూల్చివేశారు. అప్పటి నుంచి ఈ గ్రామంలో బస్టాండ్ లేదు. నిలువ నీడ లేక ప్రయాణికులు, జనం ఇబ్బంది పడుతున్నారు.


తంగళ్లపల్లిలో బస్సు కోసం వేచి ఉండే ప్రదేశం

గ్రామ పంచాయతీ వివరాలు	
★ గ్రామ పంచాయతీ ఏర్పాటు	: 1958
★ విస్తీర్ణం	: 864 హెక్టార్లు
★ ఇళ్లు	: 1,985
★ వార్డులు	: 14
★ జనాభా	: 9 వేలు
★ మహిళలు	: 4,523
★ పురుషులు	: 4,477

● మూత్రశాలలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

● ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం రహదారికి ఇరువైపులా నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని నిర్మించాలని కోరుతున్నారు.

మసీదు దగ్గర ఉందని...



మండల కేంద్రంలో ఎనిమిదేళ్ల కిందట బస్టాండ్ ఉండేది. అప్పటి అధికారులు మసీదు దగ్గర ఉందని కూలగొట్టారు. మళ్లీ వేరేచోట కడతామని చెప్పి ఇప్పటి వరకు కట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మించాలి.

- రాపెల్లి ఆనందం, విశ్రాంత ఉద్యోగి, తంగళ్లపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలో మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలోనే బస్టాండ్, మూత్రశాలలు నిర్మించాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నిర్మాణాలు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

- కందుకూరి రామాగౌడ్, తంగళ్లపల్లి


స్థలం గుర్తించి...

ఉపాధి హామీ నిధులతో నిర్మాణం చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. స్థలం లేక కొంత ఇబ్బంది వస్తుంది. వారం రోజుల్లో స్థలం గుర్తించి నిర్మాణాలు చేపడతాం.

- మీర్జా హమ్మద్ బేగ్, ఎంపీవో, తంగళ్లపల్లి ప్రత్యేక అధికారి

అంబులెన్సులో ప్రసవం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: అంబులెన్సులో ఓ గిరిజన మహిళ బుధవారం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వీర్నపల్లి మండలం బంజేరుకు చెందిన భూక్య శిల్పకు నెలలు నిండాయి. బుధవారం వేకువజామున పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు.


శిశువును కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఈఎంటీ మదన్

ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఈఎంటీ మదన్, పైలెట్ రాజశేఖర్ సాయంతో సాధారణ ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు అంబులెన్సు సిబ్బంది తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఇల్లంతకుంట: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన పోతురాజు అనిత అంబులెన్స్‌లో ప్రసవించింది. బుధవారం పురిటి నొప్పులు రాగా అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కాగా అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, మనోజ్‌లు వైద్య సేవలు అందించగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ సిబ్బందిని కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.


రంగంపేటలో సభ్యత్వం ఇస్తున్న భాజపా నాయకులు


ముస్తాబాద్‌లో...


కోనరావుపేటలో...

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: స్వశక్తి భారతానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అలుపెరగని పోరాటం చేశారని భాజపా మండలాధ్యక్షుడు గునుకుల దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో ఆయన జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బూత్‌ల వారీగా సభ్యత్వాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు విద్యాసాగర్, శ్రీకాంత్, ధర్‌సింగ్, రమేశ్, సతీశ్, కాశీరాం పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని భాజపా మండల శాఖ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భాజపా మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జింక వెంకటి, ఆకుల నాగరాజు, చింతల పరశురాములు, బోయిన నర్సయ్య, పాక మహేశ్, పొన్నం మహేశ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. పలువురికి సభ్యత్వం అందించారు. ఒరగంటి సత్యం, దీటి సత్తయ్య, పప్పుల శ్రీకాంత్, శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

★ ముస్తాబాద్‌లో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు మేర్గు అంజాగౌడ్, నాయకులు మల్లారపు సంతోష్‌రెడ్డి, పప్పుల శ్రీకాంత్, మీస శంకర్, మీస స్వామి, చీకోటి శేఖర్, రఘుపతి పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

వేములవాడ, న్యూస్‌టుడే: విద్యార్థినులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లినప్పుడే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు బ్లాంకెట్లను అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీర ప్రసాద్, ఎస్సై అంజయ్య, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

చందుర్తి: చందుర్తి మండలం మల్యాల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు బంటు కల్పన, రవిల ఇల్లు కూలిపోయింది. గ్రామ అభివృద్ధి కమిటీ, దుబాయి గ్రూప్ సభ్యులు రూ.20 వేలు ఇవ్వగా వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బుధవారం అందజేశారు.


నగదు అందజేస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

రాహుల్ అసత్య ప్రచారం మానుకోవాలి

వేములవాడ, న్యూస్‌టుడే: అమెరికా వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రిజర్వేషన్ల గురించి మాట్లాడిన మాటలను భాజపా ఎస్సీ మోర్చా తెలంగాణ శాఖ తీవ్రంగా ఖండిస్తుందని భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం వేములవాడలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను రద్దు చేస్తుందని రాహుల్‌గాంధీ చేసిన అబద్ధపు ప్రచారాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాకేశ్, నాయకులు పొచెట్టి రాకేశ్, పెరుక గంగరాజు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

వేములవాడ, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం తెలిపారు. 23 ఆగస్టు 15న వేములవాడ పట్టణానికి చెందిన మోత్కుపల్లి ఎల్లయ్య షాప్‌లోని నగదు కౌంటర్‌లో నుంచి ఆదిలాబాద్ జిల్లా దండెపల్లి మండలంలోని లక్ష్మీకాంతపురం గ్రామానికి చెందిన కాశెట్టి వెంకటేశ్ రూ.50 వేలను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి జ్యోతిర్మయి నిందితుడికి 18 నెలల కఠిన కారాగారంతోపాటు రూ.1,000 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాదారుల రిమాండ్

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని, రవాణాకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ వద్ద మానేరు వాగు నుంచి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను అదుపులో తీసుకొని బుధవారం ఠాణాకు తరలించామన్నారు. ఆవునూర్ గ్రామానికి చెందిన బత్తుల గణేశ్, కోల నితిన్, చిన్ని భానుచందర్‌లను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జూదరులపై కేసు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ ఇంట్లో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు సిరిసిల్ల పట్టణ వలయాధికారి కృష్ణ బుధవారం రాత్రి తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో వంతడుపుల సుధాకర్ నివాసంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఎనిమిది మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 38,200 నగదు, ఎనిమిది చరవాణిలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సుధాకర్, మనోజ్‌కుమార్, రమేశ్, కరుణాకర్, బాబు, శ్రీధర్, రాంచంద్రారెడ్డి, శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

సిరిసిల్ల గ్రామీణం: సిరిసిల్లలోని గీతానగర్ పాఠశాల ప్రహరీని ఆనుకొని ఉన్న విద్యుత్తు స్తంభానికి ఉన్న మీటర్ బాక్స్‌కు డిష్, అంతర్జాలం తీగలు తగిలి విద్యుదాఘాతం ఏర్పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన స్థానికులు పోలీసు, అగ్నిమాపక, సెస్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

సంక్షిప్తం

కేకేను విమర్శిస్తే ఊరుకునేది లేదు

సిరిసిల్లగ్రామీణం: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యుడు కేకే మహేందర్‌రెడ్డిపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేసినట్లు తెలిపారు. కొంతమంది భారాస నాయకులు కేకే మహేందర్‌రెడ్డిపై చేసిన తప్పుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆరోపణలు చేస్తే ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, నీలి రవీందర్, కత్తెర దేవదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఆడెపు జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

27న హలో విద్యార్థి... చలో విద్యార్థి మహా గర్జన

గంభీరావుపేట: భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో హలో విద్యార్థి.. చలో విద్యార్థి మహా గర్జనను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కల్యాణ్ కోరారు. బుధవారం దానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 27న హైదరాబాద్‌లో మహాగర్జన ఉందని, విద్యార్థులు, నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా గంగారాం

గంభీరావుపేట: గంభీరావుపేట మండల ఇన్‌ఛార్జి విద్యాధికారిగా నర్మాల గ్రామానికి చెందిన శౌంరి గంగారాంను విద్యాశాఖ అధికారులు నియమించారు. దీంతో బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం లింగన్నపేట ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఎంఈవో మురళీనాయక్ బాధ్యతల స్వీకరణ

కోనరావుపేట: కోనరావుపేట మండల విద్యాధికారిగా ధర్మారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీనాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎంఈవో దూస రఘుపతి బదిలీపై వెళ్లగా మురళీనాయక్ బాధ్యతలు స్వీకరించారు.

హైమాస్ట్ దీపాలు ప్రారంభం

ముస్తాబాద్: ముస్తాబాద్ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాత్రి హైమాస్ట్ విద్యుత్తు దీపాలను ప్రారంభించినట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు బుధవారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవతో వీటిని ఏర్పాటు చేసినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చర్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు దుబ్బాక రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడిన అగుళ్ల శ్రీనివాస్ కుటుంబాన్ని భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలోని పలువురు నాయకులు బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చి, వారికి ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, నాయకులు కొండ రమేశ్‌గౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

బోయినపల్లి: గ్రామాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్పీ సీఈవో వినోద్ సూచించారు. గ్రామ మంచినీటి సహాయకులకు బోయినపల్లి రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సీఈవో పాల్గొన్నారు. నాలుగు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు చేతి పంపులపై అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అభిషేక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంచినీటి సహాయకులకు ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల శిక్షణను మండల ప్రత్యేకాధికారి లత బుధవారం ప్రారంభించారు. మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ రాము, ఏఈ హరిప్రియ, ఎంపీవో బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించండి

సిరిసిల్ల కలెక్టరేట్: ఇటీవల జారీ చేసిన ఉపాధ్యాయులకు సంబంధించిన హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి కోరారు. ఉత్తర్వులను సవరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్‌లో ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అవురం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై నమ్మకం కలిగించేలా ప్రభుత్వ చర్యలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుత ప్రభుత్వం గాడి తప్పిన విద్యారంగాన్ని గాడిన పెట్టేందుకు చేపడుతున్న చర్యలను స్వాగతిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పర్కాల రవీందర్, ఆడెపు శివకుమార్, శ్రీనివాస్, నాగరాజు, సధీర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటును నిలిపివేయాలి

గంభీరావుపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సముద్రలింగాపూర్ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉమా బాల్‌చందర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొటగిరి బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఫిట్స్

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో బుధవారం రాత్రి ఆటో నడుపుకుంటూ వెళ్తున్న డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చింది. పట్టణంలోని తెలంగాణ కూడలి వద్దకు రాగానే ఆటో డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చి ఆటో డివైడర్‌కు ఢీకొంది. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆటో డ్రైవర్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.


చందాలతో అంత్యక్రియలు

చందుర్తి, న్యూస్‌టుడే: చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన వాసం ప్రసాద్ అనే ఆటో డ్రైవర్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులు, బంధువులు చందాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పీఆర్సీ, పీఎఫ్, ఈఎస్ఐ తదితర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే అక్టోబరు 8న చలో మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుర్రం శంకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాసారపు శంకర్, దొబ్బల లచ్చయ్య, బత్తుల దేవరాజు, రెడ్డిమల్ల రాజయ్య, వేల్పుల బాలయ్య, ఉమ, శంకరవ్వ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు


వేములవాడ: వంతెన వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతెన వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, జిల్లా అధ్యక్షుడు అజ్జవేణు, విజయ్, రాజయ్య, మల్లేశం, వజ్రమ్మ, వాల్మీకి, నరేశ్, చంద్రయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.